www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక :4 | 01-11-2021 | పుటలు : 4





## ఉన్నత విద్య సమీక్షలో పాల్గొన్న నన్నయ వీసీ


సీఎం ను సన్మానించి అభినందిస్తున్న వీసీ



**25.10.21 (మీడియాసెల్)** సోమవారం ఉన్నత విద్యపై తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో హాజరైన ఉపకులపతి ఆచార్య జగన్నాథరావు నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సమీక్షలో చర్చించిన కీలక అంశాలను వీసీ జగన్నాథరావు తెలియజేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఉన్నత విద్యలో, కోర్సుల్లో కూడా చాలా మార్పులు తీసుకు వచ్చామని, చదువులున్నా, ఇంటర్వ్యూల దగ్గరకు వచ్చేసరికి విఫలం అవుతున్న పరిస్థితులు చూస్తున్నామని, అప్రెంటిస్‌షిప్ కచ్చితంగా ఉండాలని, ప్రతి పార్లమెంటు స్థానంలో ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని తీసుకు వస్తున్నామని గౌరవ ముఖ్యమంత్రి తెలిజేశారన్నారు. ఉద్యోగాల కల్పన దిశగా చదువులు ఉండాలని, మైక్రోసాఫ్ట్‌లాంటి సంస్థలతో శిక్షణ అన్నది నిరంతరం కొనసాగాలని, కోర్సుల్లో శిక్షణను ఇంటిగ్రేట్ చేయాలని అప్పుడు ఉద్యోగావకాశాలు మరింతగా మెరుగుపడతాయన్నారు. ఎడ్యుకేషనల్‌గా మనం వచ్చిన తర్వాత తేడా ఏంటి అన్నది కనిపించాలని ఉద్యోగాల కల్పన దిశగా చదువులు ఉండాలని జాబ్ ఓరియెంటెడ్‌గా మన కోర్సులను తీర్చిదిద్దామని, రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన విద్యనే ఆస్తిగా అందించాలన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, నైపుణ్యం వంటి అంశాలపై సీఎం ప్రణాళికాబద్ధంగా సమీక్ష నిర్వహించారని వీసీ తెలియజేశారు.



### నవంబర్ 1
## ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం!

అమరజీవులైన శ్రీ పొట్టి శ్రీరాములు గారి త్యాగఫలం!! జాతి జనుల ఆత్మ గౌరవం కోసం ఆయన చేసిన పోరాటం, ప్రాణత్యాగం తెలుగువారికి గర్వకారణం.స్ఫూర్తి దాయకం.

భక్త్యంజలి.....

- నన్నయవాణి

## వసతులను అభివృద్ధి చేయండి

### ఈసీ మీటింగ్‌లో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సతీష్ చంద్ర ఐఏఎస్

**29.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లను ఆధునిక వసతులతో అభివృద్ధి చేయాలని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సతీష్ చంద్ర ఐఏఎస్ అన్నారు. శుక్రవారం ఆన్లైన్ విధానంలో విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన పలు కీలకాంశాలను చర్చించారు. ఈ సందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సతీష్ చంద్ర మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఐ.ఎస్. ఓ, ఏ.ఐ.సి.టి.ఇ. గుర్తింపును సాధించడం అభినందనీయమని త్వరలో నాక్ లో మంచి గ్రేడ్ ను సాధించాలని అన్నారు. నాక్ గుర్తింపుకు అవసరమైన కేటగిరీలను బలోపేతం చేసుకోవాలని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నాక్ గుర్తింపును సాధించాలన్నారు. నూతన భవనాలు, ఆధునిక వసతులు సమకూర్చుకొని నాణ్యమైన విద్యా కేంద్రాలు విశ్వవిద్యాలయాలను తయారు చేయాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ వంటి ల్యాబొరేటరీ లను ఆధునిక హంగులతో రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్ రెడ్డి సూచించిన ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు, ఉపాధి కల్పన, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలను అన్ని కళాశాలలకు ప్రత్యేక సమావేశాల ద్వారా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ నాక్ గుర్తింపు త్వరలో సాధిస్తామని, విశ్వవిద్యాలయ క్యాంపస్ లను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సీఎం సూచించిన కీలకాంశాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఈసీ మెంబర్లు అందరు పాల్గొన్నారు.





## సంపాదకీయం



# తమసోమా....

జ్యోతిర్గమయ! 'చీకటి నుంచి వెలుగుకి' అని అర్థం. దీపం అంటే తిమిరంతో సమరం. ఒక వెలుగు. చీకట్లను తిట్టుకుంటూ కూర్చోవడం కన్నా చిన్న దీపం వెలిగించమని కదా పెద్దలు చెప్పింది. దీపం మనకి గొప్ప సందేశాన్నిస్తుంది. అవకాశాన్ని అందిపుచ్చుకుని దీపశిఖ పైకి ఎదుగుతుంది. పక్కకి విస్తరిస్తుంది. కొన్నిసార్లు నిశ్చలంగా వెలుగుతుంది. యోగ సమాధిలోని మునిలా ఉంటుంది. సాధకులు ఏకాగ్రత కోసం దీపశిఖపైనే దృష్టి నిలుపుతారు. అందుకనే వారు లోవెలుగుల్ని దర్శిస్తారు.

దీపం తాను క్రీనీడలో ఉండి వెలుగును మనకు అందిస్తుంది. అగ్నిశిఖ లక్షణాన్ని వర్ణించిన కాళిదాస మహాకవిని సంస్కృతంలో 'దీపశిఖాకాళిదాసు' అన్నారు. వెలుగుతున్న కాగడాని తలక్రిందులు చేసినా దాని జ్వాల తలవంచకుండా పైకే చూస్తుంది. దీనినుంచి మనం ఒక సందేశాన్ని అన్వయింపచేసుకోవచ్చు. గొప్ప వ్యక్తిని, మేధావిని, సత్ప్రవర్తన కలిగినవారిని తలక్రిందులు చేయాలని ప్రయత్నించినా, వారు అగ్నిశిఖల్లా ఊర్ధ్వముఖులుగా ఎదుగుతారు. దీనినే గురుదేవులు రవీంద్రులు 'ఎక్కడ మానవుడు సగర్వంగా తలెత్తుకొని తిరుగుతాడో..... అటు వైపునకు నడిపించు తండ్రీ!' అని గీతాంజలిలో ప్రార్థించారు. జ్ఞానానికి మరోపేరే వెలుగు.

' దీపాదుత్పన్న దీపమివ!' అని వేద వాక్యం. ఒక దీపం అనేక దీపాల్ని వెలిగిస్తుంది. 'ముదితల్ నేర్వగ రాని విద్య కలదే, ముద్దార నేర్పింపగన్'అన్నారు చిలకమర్తివారు. సత్యభామ యుద్ధ విద్యలన్నీ నేర్చుకుంది. నరకాసురుని రాక్షస కృత్యాలకు ముగింపుపలకాలని శ్రీకృష్ణుడు సత్యభామను వెంటపెట్టుకుని యుద్ధానికి వెళ్ళాడు. 'అరి జూచున్ హరి చూచు....'అని ప్రసిద్ధమైన పద్యం. సత్యభామ శత్రువును, కృష్ణుని చూస్తూ మహత్తరమైన యుద్ధం చేసిందని నాచన సోమన అభివర్ణించాడు. నరకాసుర వధ సత్యభామ చేతుల మీదుగా జరిగింది. చీకట్లు పటాపంచలై దీపోత్సవం వెల్లివిరిసింది. ఒక శక్తివంతమైన మహిళ విజయానికి చిహ్నంగా నిలుస్తూ అది దీపావళి అయింది.

పంచినకొద్దీ పెరిగేవి దీపం, అక్షరం. అదిగో... ఒక దీపం వేలకొద్దీ దీపాల్ని వెలిగిస్తుంది. ఉపాధ్యాయుడు తాను వెలుగుతూ వేలకొద్దీ జ్ఞానదీపాల్ని వెలిగిస్తాడు. అవి అక్షర దీపాలై ఈ లోకాన్ని దేదీప్యమానం చేస్తాయి.

కాబట్టి దీపావళికి దీపాల్ని, సర్వత్రా జ్ఞాన జ్యోతులు నింపడానికి అక్షర దీపాల్ని వెలిగిస్తూనే ఉండాలి.

# వీసీని కలిసిన సిగ్మా రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ డైరెక్టర్



సుబ్రహ్మణ్యం దంపతులను అభినందిస్తున్న వీసీ

**30.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును న్యూఢిల్లీకి చెందిన సిగ్మా రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.వి.ఆర్. సుబ్రహ్మణ్యం మర్యాద పూర్వకంగా కలిసారు. శనివారం వీసీ కార్యాలయంలో విద్య మరియు పరిశోధనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సామాజిక పరిశోధన రంగంలో సహకారం కోసం వివిధ అవకాశాల గురించి వివరించారు. సిగ్మా భారతదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోని ప్రాజెక్టలలో జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేస్తోందన్నారు. సోషల్ సైన్సెస్‌లోని విద్యార్థులు వారి ప్రాజెక్ట్ పనుల కోసం రీసెర్చ్ ఇంటర్న్‌గా సిగ్మాతో కలిసి పని చేయవచ్చని డైరెక్టర్ సూచించారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించి విద్యార్థుల ప్రయోజనార్థం సిగ్మా రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ తో కలిసి త్వరలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందామన్నారు. ఈ అవగాహనా ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రాజెక్టులలో, పరిశోధనలలో విద్యార్థులకు అవకాశాలు ఉంటాయన్నారు. సుబ్రహ్మణ్యం దంపతులను వీసీ సన్మానించి అభినందించారు.

# డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల



రైటప్:- పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ


**30.10.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. శనివారం వీసీ కార్యాలయంలో ఆయన ఫలితాలు విడుదల చేసి వివరాలను తెలియజేశారు. ఉభయగోదావరి జిల్లాల్లోని డిగ్రీ 6వ సెమిస్టర్ బిఏ, బికామ్, బిబిఏ, బిఎస్సీ, బిసిఏ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొత్తం 24158 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారని వారిలో 18042 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 74.68 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. కోవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ జ్యోతి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్.ఎస్.ఎన్ కాంపస్‌లో AICTE అవగాహన సదస్సు



**30.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ నందు ఏ.ఐ. సి.టి. ఈ అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కమల కుమారి మాట్లాడుతూ ఇటీవలే నన్నయ్య యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ విభాగం అలాగే ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ నందు ఎంబీఏ మరియు ఎంసిఏ విభాగాలకు ఏఐసీటీఈ గుర్తింపు లభించిందని దీని ద్వారా దాదాపు 40 పథకాలు అమలులో ఉన్నాయని ఈ పథకాలను ప్రస్తుత కాలంలో తెలుసుకోవడం చాలా చాలా అవసరమని అందువలన క్యాంపస్ లోని ఎంబీఏ మరియు ఎంసీఏ విభాగాలకు చెందిన అధ్యాపకులకు వివిధ పథకాలను ప్రజెంటేషన్ రూపంలో అందించామన్నారు. సమష్టి కృషితో ఈ పథకాలను చర్చించడం వలన రాబోవు తరాలకు మరింత అభివృద్ధి జరుగుతుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ రామ రాజు ,ఎండీ.నదీం,డాక్టర్ అజయ్ రతన్ ,డా.అప్పారావు, అనిలాంబిక ,డాక్టర్ మధు కుమార్, డా. శ్రీదేవి ,మనోజ్ దేవ, వరప్రసాద్ పాల్గొన్నారు.

# సెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



ఏపీ సెట్ పరీక్షలను పరిశీలిస్తున్న వీసీ

**31.10.21 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ 2021 రాజమహేంద్రవరం పరీక్షా కేంద్రాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. ఆదివారం రాజమహేంద్ర వరంలోని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్, ఎస్కేవి టి కళాశాలలోని పరీక్షా కేంద్రాలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని 10 పరీక్షా కేంద్రాలలో సెట్ పరీక్షలు జరిగాయన్నారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని 5959 మంది విద్యార్థులు సెట్ పరీక్షలు వ్రాయల్సి ఉండగా 4835 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని హాజరు శాతం 81గా ఉందన్నారు. రాజమహేంద్రవరం పరిధిలోని గైట్ కాలేజ్, నన్నయ్య క్యాంపస్, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్, ఎస్.కె.ఆర్. ఉమెన్స్ కాలేజ్, ఎస్.కె.వి.టి. కాలేజ్, ఆదిత్య డిగ్రీ కాలేజ్, ఆదిత్య ఉమెన్స్, రాజమహేంద్రి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, ఆదిత్య ఫార్మా, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ సూరంపాలెం పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయ న్నారు. విద్యార్థులందరూ కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సెట్ రీజినల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.టేకి, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.




ప్రతిభా వాణి

## దాశరథి కృష్ణమాచార్యులు



తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య (జూలై 22, 1925 - నవంబర్ 5, 1987) .

'దాశరథి'గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి అప్పటి ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి.

ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసారు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసారు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసారు.

నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయారు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించారు.

"రైతుదే తెలంగాణము రైతుదే.ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని గర్జించాడు. "దగాకోరు, బటాచోరు, రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్ " అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసారు.ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించారు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది నిజాము ప్రభుత్వం. ఆయనతోపాటు ఖైదులో రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసారు. మంచి ఉపన్యాసకులు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించారు.ఆయన ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకరు.1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా సాహితీ చైతన్యాన్ని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు సేవలందించారు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నారు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నారు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి "గాలిబ్ గీతాలు" పేర అనువదించారు.ఆ మహాకవికి నన్నయవాణి అక్షర నీరాజనం!!

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



**27.10.21 (మీడియాసెల్)** పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని, క్లీన్ ఇండియా పై యువత సమాజానికి అవగాహన కల్పించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు క్లీన్ ఇండియా ప్రోగ్రాం లో భాగంగా బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణ పరిసరాలను విద్యార్థులు శుభ్రపరచారు. విశ్వవిద్యాలయ కేంద్ర పరిపాలన భవనం, డా.బి.ఆర్.అంబేద్కర్ గ్రంథాలయం, ఇంటర్నేషనల్ గెస్ట్ హౌస్, హెల్త్ సెంటర్, క్రీడా మైదానాల లోని ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తను విద్యార్థులు తొలగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులు క్యాంపస్ ను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ రహిత క్యాంపస్ గా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉండాలని అన్నారు. ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చెత్తకుండీలను ఏర్పాటు చేసామని వాటిని వినియోగించుకోవాలన్నారు. మన పరిసరాలను మనం పరిశు భ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. తరువాత ప్రత్యేక అతిథిగా హాజరైన యూత్ అసిస్టెంట్ రీజినల్ ఆఫీసర్ ఎన్.సజయ్ కుమార్ ను వీసీ సన్మానించి అభినందించారు. ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ బి. కెజియారాణి మాట్లాడుతూ క్లీన్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా 300 కేజీల చెత్తను సేకరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు రాహుల్ పాల్, డా.పద్మవల్లి, డా.టి.అనిత, డా.జె.రాజకుమారి ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.



సంజయ్ ను సన్మానిస్తున్న వీసీ జగన్నాథరావు



క్లీన్ ఇండియా ప్రోగ్రాం నిర్వహిస్తున్న విద్యార్థులు

## పీజీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ

**27.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం క్యాంపస్ లోని పీజీ పరీక్ష కేంద్రాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలల్లోని ఆయా కోర్సులకు సంబంధించిన పరీక్షలు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగుతున్నాయి. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వీసీ వివరాలను తెలియజేశారు. పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని విద్యార్థులందరూ కోవిడ్ నిబంధనలను పాటిస్తూ పరీక్షలు వ్రాస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఎంసీఏ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నయన్నారు. పరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం



శ్రీనివాసరావు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న వీసీ

**28.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో అధ్యాపకునిగా పని చేస్తూ రెండో దశ కోవిడ్ లో మృతి చెందిన డా.అరిగెల శ్రీనివాసరావు కుటుంబానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. గురువారం విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయంలో శ్రీనివాసరావు కుటుంబానికి వీసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో శ్రీనివాసరావు సౌమ్యుడిగా, మంచి అధ్యాపకుడిగా గుర్తింపు పొందారని, వారి కుటుంబానికి విశ్వవిద్యాలయం అండగా ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయంలోని సిబ్బంది అంతా శ్రీనివాసరావు కుటుంబానికి సహకరించేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. లక్షా యాభై ఎనిమిది వేల రూపాయల ఆర్థిక సహ కారాన్ని శ్రీనివాసరావు కుటుంబానికి అందిస్తున్నా మన్నారు. విభాగ అధ్యాపకులు శ్రీనివాసరావు కుటుంబానికి అండగా, ధైర్యం గా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.ఉమా మహేశ్వరి, డా.రాజేంద్ర ప్రసాద్ విభాగాధ్యాపకులు పాల్గొన్నారు.

# సైనికుడు



పోరాడుతూ పోరాడుతూ
అలా నేలకొరుగుతావు
వేల ప్రాణాల్ని నిలిపేందుకు
నువు గాలిలో దీపమౌతావు

రాత్రి
గుండెల మీద చెయ్యి వేసుకుని
పచ్చని కలలు కంటున్న దేశం
వెచ్చని నీ నెత్తుటి స్పర్శతో ఉలిక్కిపడుతుంది

ఛిద్రమైన నీ దేహాన్ని
పొద్దున్నే యీ జాతి
జండాలా ఎగరేస్తుంది
రెపరెపలాడుతున్న నీ ఆత్మకి
పిడికెడు గర్వంతో సెల్యూట్ చేస్తుంది


అమరుడా!
వీర సైనికుడా!
అప్పుడప్పుడు వెలిసిపోయే జాతి జెండాకు
ఎప్పటికప్పుడు రంగులద్దుతున్నది
నీ రక్తమే

- నూటెంకి రవీంద్ర,
మంచిర్యాల,9491533295



# వీసీని కలిసిన మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు

**29.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును అనుబంధ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం విశ్వవిద్యాలయంలోని వీసీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఉభయగోదావరి జిల్లాలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలను విద్యా ప్రగతి వైపు ముందుకు తీసుకువెళ్లేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న వీసీకి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల ప్రయోజనార్థమై అవసరమైన నిర్ణయాలు తీసుకోవడంలో వీసీ తక్షణమే స్పందిస్తారని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నత విద్యపై రాష్ట్ర స్థాయి సమీక్షను నిర్వహించి పలు కీలక అంశాలను తెలియజేశారన్నారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన వంటి ప్రధాన అంశాలపై దృష్టి సారించాలని సీఎం సూచించారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు సీఎం జగన్మోహన్ రెడ్డి ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చి విద్యార్థులందరికీ ప్రయోజనం చేకూర్చాలని వీసీ తెలియజేశారు. దీనిపై స్పందించిన మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు ఉన్నత విద్య అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, వీసీ మార్గదర్శకంలో విద్య ప్రగతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి, కరాటం నరసింహారావు, రమణరావు, బ్రహ్మాజీ, తోట వాసు తదితరులు పాల్గొన్నారు.


వీసీని కలిసిన మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు

# వీసీని కలిసిన న్యాయసేవాధికార సంస్థ సభ్యులు


వీసీని మర్యాదపూర్వకంగా కలిసిన లాయర్స్

**27.10.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును బుధవారం జిల్లా కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, డిఎల్ఎస్ఏ ప్యానల్ న్యాయవాది ధర్నాలకోట వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మజ్జి బబిత ఆదేశాల మేరకు డిఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి పర్యవేక్షణలో నవంబర్ 2 నుండి నవంబర్ 14 వరకు జిల్లా వ్యాప్తంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని నన్నయ వర్సిటీలో కూడా లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహిస్తే విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని న్యాయవాదులు అనంతరావు, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈసందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ వర్సిటీలో లీగల్ అవేర్నెస్ క్యాంపు చేయతలపెట్టడం అభినందనీయమని దీనిద్వారా విద్యార్థులకు న్యాయ చట్టాలపై మరింత అవగాహన పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. అశోక్ పాల్గొన్నారు.

## మంచి మాట

నిరాశని
మించిన చీకటి,
ఆశావహ
దృక్పథాన్ని
మించిన వెలుగు
ప్రపంచంలో
మరేమీ ఉండవు.

- ప్రేమ్ చంద్
(హిందీ రచయిత)



# సామాజిక బాధ్యతగా ఎల్ఐసి

**29.10.21 (మీడియాసెల్)** సామాజిక బాధ్యతగా ఎల్.ఐ.సి. నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్శిటీ సహకారంతో భారతీయ జీవిత బీమా సంస్థ విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌ని నిర్వహిస్తుంది. "స్వతంత్ర భారతదేశం ఏ75: సమగ్రతతో స్వయం రిలయన్స్" అనే థీమ్‌తో విజిలెన్స్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తుంది. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని వీసీ జగన్నాథరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారత దేశ ప్రజలకు అత్యంత నమ్మకమైన సంస్థ ఎల్.ఐ.సి. గుర్తింపు పొందిందని అన్నారు. ఎల్ఐసి ఎంతో సామాజిక బాధ్యతగా వ్యవహరిస్తూ నిర్వహించే కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు సృజనాత్మకమైన అంశాలు తెలుస్తాయన్నారు. దేశం పట్ల,సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం అలవాటు అవుతుందన్నారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశ ఆర్థిక వ్యవస్థలో విజిలెన్స్ యొక్క ప్రాముఖ్యాన్ని వివరించారు. అవినీతిని అరికట్టడానికి కొత్త మార్గాలను రూపొందించడానికి యువతను ప్రోత్సహించారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాలని వీసీ సూచించారు. విజిలెన్స్ అవేర్నెస్ పై క్యాంపస్ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించామని దీనిలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారని విజేతలకు ఎల్.ఐ.సి. వారు బహుమతులు అందిస్తారని వాణిజ్య శాస్త్ర సమన్వయకర్త డా. ఎన్. ఉదయభాస్కర్ తెలిపారు. అనంతరం నిర్వాహకులు వీసీని శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి. రామయ్య, ఏ. నాగేంద్ర కుమార్ (పి&ఐ.ఆర్), ఎమ్. ఫణి కుమార్, కె. విద్యా సాగర్, ఎమ్.బాలకృష్ణ మూర్తి, పి. శిరీష్ కుమార్, డా.జి. కీర్తి మరిటా, బి.అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీసీ

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in